

నేటి నుంచి ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - కాకినాడ

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈ నెల 8 నుండి 10 వరకు జరుగు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బేకుమూడి ఈశ్వరరావు, కె.ఎస్. శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికులు, పేదలు సమస్యలపై ఈ మహా సభలో చర్చిస్తారని తెలిపారు. 8వ తేదీన జంగారెడ్డిగూడెం లో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యురాలు కామ్రేడ్ బృందా కారత్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.విజయరాఘవన్, బి.వెంకట్ పాల్గొంటారని తెలిపారు.

తుపాను అప్రమత్తం...

- రైతుల గుండెల్లో గుబులు - మత్స్యకారులు ఇళ్లకే పరిమితం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

దక్షిణ అండమాన్‌లో ఉన్న అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి మంగళవారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా, సాయంత్రానికి వాయుగుండంగా మారిందన్న తుఫాన్ హెచ్చరికలతో ప్రస్తుతం ముమ్మరంగా వరి కోతలు జరుగుతుండటంతో రైతుల్లో గుబులు మొదలైంది. బుధవారం పొలాల్లో ఉన్న ధాన్యాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అధికారులు రైతులకు ఆదేశించారు. రెండు రోజులు నుంచి రైతులు మాత్రం రాత్రి పగలు చేలల్లో ఉండి యంత్రాలతో వరి కోతలు కోయిస్తూ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. మరో వైపు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని, వెళ్లినవారు తక్షణమే తిరిగి రావాలని అధికారులు జాలర్లకు ఆదేశాలు జారీ చేశారు. సముద్రం మాత్రం ప్రస్తుతానికి ప్రశాంతంగా ఉంది. బోట్లను రామన్నపాలెం బ్రిడ్జి వద్ద నిలిపి, మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు. **ఏలేశ్వరం:** రానున్న మూడు రోజులు పెను తుఫాన్ పొంచి ఉన్నందున రైతన్నలు అప్రమత్తంగా ఉండాలని కోతలు కోయరాదని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి రైతులను అప్రమత్తం చేశారు. రైతులు కల్లాల్లో అందు బాటులో ఉన్న ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలకు చేర్చాలని, లేనిపక్షంలో బస్తాలు కట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆమె సూచించారు.



ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో రైతులు

గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున పంటలు నేలకు ఒరిగిపోకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని రైతులను అప్రమత్తం చేశారు. **రౌతులపూడి** మండల వ్యవసాయ అధికారి ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ తుపాను కారణంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున మూడు రోజులు పాటు మండలంలోని రైతులు ఇప్పటివరకు కోసిన వరి పంటను కుప్పలుగా పెట్టుకోవడంతోపాటు, వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

సజావుగా ధాన్యం సేకరణ



గొల్లప్రోలు మండలంలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - పిఠాపురం

రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు కృషిచేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. బుధవారం పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో రెవెన్యూ, పౌరసరఫరాల, వ్యవసాయ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పర్యటించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, లక్ష్మీపురం పంటపొలాల వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. చేబ్రోలు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. శ్రీమహేశ్వరి మోడ్రన్ రైస్ మిల్‌ను తనిఖీ చేసి రైతులు నుంచి కొనుగోలు చేసిన ధాన్యం, గోనె సంచులు, తేమశాతం యంత్రం తదితరాలను పరిశీలించారు. అనంతరం జల్లూరు గ్రామ రైతులకు సంబంధించి కళ్లాల వద్ద ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. జల్లూరు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి ధాన్యం సేకరణ ప్రక్రియపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఫక్రుద్దీన్‌పాలెంలో వెంకట సత్యనారాయణ రైస్ మిల్లును తనిఖీ చేసి రైతులు నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన వాహనాలను సకాలంలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో గోనె సంచులు నిల్వ ఉండేవిధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టరు అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కలెక్టరు వెంట పౌర సరఫరాల సంస్థ డీఎం డి.పుష్పమణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, కుడా వీసీ సుబ్బారావు, గొల్లప్రోలు జడ్‌పిటిసి లోవరాజు, గొల్లప్రోలు, పిఠాపురం తహశీల్దార్లు ఆర్.వెంకటేశ్వరరావు, పి.త్రినాథ్‌రావు, వ్యవసాయశాఖ అధికారులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : జెసి

తాళ్ళరేవు మండలం పి.మల్లవరం,పత్తిగొందిలో జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా పర్యటించి రైతుల ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట తాళ్ళరేవు మండలం ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి డి.ఎస్.ఎస్. సునీత, ఎంపిడిఒ. ఎం.అను పమ, తహశీల్దార్ పోతురాజు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాలు

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వాలు వివిధ పథకాలు, కార్యక్రమాలు, రాయితీలను అందిస్తున్నాయని వీటి ఫలాలు అవినీతికి తావు లేకుండా, ఆకలి మరణాలు అనేవి లేకుండా, లబ్ధిదారులకు అందేందుకు అధికారులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి కమిషన్ సభ్యులు జె.కృష్ణకిరణ్, పౌర సరఫరాలు, ఐసీడీఎస్, విద్య తదితర సమన్వయ శాఖల అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కాకినాడ అర్బన్ కచేరి పేటలో ఎండీయూ వాహనం ద్వారా ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. ప్రజలకు పంపిణీ చేస్తున్న బియ్యం, కంది పప్పు తదితర సరుకుల నాణ్యతను పరిశీలించారు. కాకినాడ జగన్నాథపురంలో ఎ.శ్రీనివాస రావుకు చెందిన చౌక ధరల దుకాణాన్ని, అన్నమ్మ ఘాటిలో ఎంవీవీ సత్య నారాయణ చౌక ధరల దుకాణాన్ని ఛైర్మన్ తనిఖీ చేశారు.

కరప మండలం పెనుగుదురులో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఎంపిపి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరపలోని శ్రీ నక్కా సూర్యనారాయణ మూర్తి జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజనాలను, సరుకుల నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు ఫోర్టిఫైడ్ బియ్యం ప్రాధాన్యం, పోషక విలువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వేళంగిలోని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎంఎల్‌ఎస్ పాయింటును సందర్శించి బియ్యం బస్తాలు, కందిపప్పు నిల్వను పరిశీలించి హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురజానపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, జడ్‌పి ఉన్నత పాఠశాల, జగన్నాథపురం సెంటర్లో బచ్చు రామం నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 పరిధిలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఏర్పడిందని ఈ కమిషన్‌కు తాను రెండో ఛైర్మన్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. 2022, మార్చిలో బాధ్యతలు స్వీకరించిన దగ్గరి నుంచి ఇప్పటి వరకు 475 వరకు కేంద్రాలను సందర్శించినట్లు వెల్లడించారు. పౌర సరఫరాల వ్యవస్థ ఆహార ధాన్యాల పంపిణీ, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లతో పాటు ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై)పై కమిషన్ దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ లోటు పాట్లను గుర్తిస్తూ సరిదిద్దుతున్నట్లు వెల్లడించారు. అధికారులు, సిబ్బంది నీతినిజాయితీలతో పనిచేయాలని విజయ ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం కాకినాడ జిల్లాలో పర్యటన ప్రారంభ మైందని గురువారం ఉదయం వరకు జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఫుడ్ కమిషన్ ఛైర్మన్ వెంట ఫుడ్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, సివిల్ సప్లయ్స్ డీఎం డి.పుష్పమణి, జిల్లా పౌరసరఫరాల అధికారి డి.చాముండేశ్వరి, ఏఎస్‌వో టి.ప్రసన్న లక్ష్మీదేవి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఇన్‌ఛార్జ్ డీఈవో ఆర్‌జే డానియల్ రాజు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.డి.సలీమ్ ఉన్నారు.



మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలిస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

జెవికె నమోదు పూర్తికి 2 రోజులే గడువు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జగనన్న విద్యా కానుక సంబంధించి ప్రతి పాఠశాల నూరు శాతం నమోదు చేయాలని సమగ్ర శిక్ష కమ్యూ నిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావు సూచించారు. బుధవారం సాయంత్రం సామర్లకోట ఎంఇఒ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఎంఒ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కింద ఇచ్చిన ప్రతి వస్తువు పిల్లల చేత బయో మెట్రిక్ వేయించాలన్నారు. చాలా పాఠశాలలో 90 నుండి 95 శాతం వరకు పూర్తి చేశారని మిగతా 5 శాతం పూర్తి చేయని కారణంగా జేవికే వంద శాతం బయోమెట్రిక్ పూర్తి కాలేదన్నారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు మూడు జతలు యూనిఫామ్ ఒక జత షుడులు, రెండు జతల సాక్షులు బెల్టు నోటు పుస్తకాలు, డిక్షనరీలు ఇచ్చినట్లు చెప్పారు అయితే జేవీకే యాప్‌లో కొన్ని రకాల సంబంధించిన ఐటెంలో విద్యార్థి చేత బయోమెట్రిక్ వేయించలేదన్నారు. దీని కారణంగా పాఠశాలకు సరుకులు ఇచ్చిన బయోమెట్రిక్ పూర్తి కాని కారణంగా ఇబ్బందులు వస్తున్నట్లు తెలిపారు.



ఎంఇఒ కార్యాలయంలో సమీక్షిస్తున్న సిఎంఒ నాగేశ్వరరావు

దీని నిమిత్తం రాష్ట్ర విద్యాశాఖ మరో మూడు రోజులు జెవికె కోసం గడువు పొడిగించినట్టు చెప్పారు ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థులు బూటు కొలతలు గ్రిడ్జ్ పేపర్ మీద నమోదు చేసి ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలన్నారు. దీనికి రెండు రోజులు మాత్రమే గడువు ఉందని ఈ నెల 12వ తేదీ లోపు బూట్లు ఆన్లైన్లో నమోదు చేయాల న్నారు. ప్రతి గ్రామం లోని భవిత కేంద్రం ద్వారా వికలాంగ పిల్లలకు చేస్తున్న సంక్షేమ పథకాలు డిస్ప్లే ద్వారా ప్రతి గ్రామాలను ప్రదర్శించాలని ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు తెలియజేయడానికి గ్రామంలోని దాతలు సహకారంతో ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంఇఒ వై శివరామ కష్ణయ్యను ఆదేశించారు. అనంతరం సామర్ల కోట మండల ఎంఆర్‌సి సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. తొలుత సామర్లకోట భవిత కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్ఓ వై.రాంబాబు ఎంఇఒ కార్యాలయం సిబ్బంది, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

12 నుంచి విజయనగరంలో 'ఆశా'ల రాష్ట్ర మహాసభ

-గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

విజయనగరంలో ఈ నెల 12,13 తేదీల్లో జరుగుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) 4వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద యూనియన్ నాయకులు గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ మాట్లాడుతూ ఆశా వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి కొన్ని హక్కులు సాధించుకున్నామన్నారు. 24 గంటలు పని చేస్తున్నా కనీస వేతనాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆశా వర్కర్స్ కుటుంబాలకు దక్కడం లేదన్నారు. ఆశా వర్కర్లకు సెలవులు గానీ, జీతంతో కూడిన ప్రసూతి సెలవులు గానీ లేవన్నారు. 3 సంవత్సరాలకు ఒకసారి జరిగే రాష్ట్ర మహాసభలు ప్రస్తుతం డిసెంబర్ 12,13 తేదీల్లో విజయనగరం లో జరుగుతున్నాయని తెలిపారు. 12 వ తేదీ విజయనగరం రైల్వే స్టేషన్ నుండి ర్యాలీ నిర్వహిస్తారని, అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఆశా వర్కరుల అంతా మహాసభలకు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్ల ఈశ్వరి, నాయకులు భారతి, వేణు, నాగలక్ష్మి లతో పాటు సత్య, రాణి, సిఐటియు నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, మలక వెంకట రమణ, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఆరోగ్యశ్రీ ఫిర్యాదులకు పరిష్కారం

-డీడీసీ సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలందేలా కషిచేయాలని ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా క్రమశిక్షణ కమిటీ (డీడీసీ) సమావేశం జరిగింది. ఆరోగ్యశ్రీ పథకం జిల్లాలో అమలుతీరు, అందుబాటులో ఉన్న ఆరోగ్య మిత్రలు, టీం లీడర్లు, అర్జీల స్వీకరణ, పరిష్కార వ్యవస్థ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పారదర్శకతతో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, నెట్‌వర్క్ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించే వ్యవస్థలో ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో 84 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుప త్రులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ కింద ఆమోదం పొంది ఉన్నాయని, ఈ ఆసుపత్రుల్లో 79 మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య మిత్రలకు సంబంధించి ఖాళీలు ఏవైనా ఉంటే వెంటనే భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చర్యల ద్వారా ఆరోగ్యశ్రీ సేవల వ్యవస్థను పటిష్టం చేయొచ్చన్నారు. ప్రతి నెల మొదటి బుధవారం డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశాలను నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలు ఫలప్రదంగా జరిగేందుకు వీలుగా నెలవారీగా సవివర నివేది కలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ స్థాయిలో ఏఎన్ఎంలకు ఆరోగ్యశ్రీ సేవలు, ప్రత్యేక యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనూ ప్రత్యేకంగా నోడల్ సిబ్బందిని నియమిం చాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించిన సమాచారాన్ని పోస్టర్ల రూపంలో ప్రదర్శించాలన్నారు. 104, స్పందన, ఐవీ ఆర్ఎస్, వ్యక్తిగత మార్గాల ద్వారా అందే ఫిర్యాదులను, అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీదారులు సంతప్తి చెందేలా గ్రీవెన్సుల పరిష్కారం ఉండాలని కలెక్టర్ కృతికాశుక్లా స్పష్టం చేశారు. సమావేశానికి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శాంతిప్రభ, కమిటీ సభ్యులు డాక్టర్ ఎస్.చక్రరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వ యకర్త డాక్టర్ పి.రాధాకృష్ణ, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ కె.నవీన్ హాజరయ్యారు.



సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

రిక్షా కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పిఠాపురం

రిక్షా కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకులు అన్నారు. స్థానిక నండూరి ప్రసాదరావు భవన్‌లో పట్టణ రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) జనరల్ బాడీ సమావేశం వల్లూరి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ జనరల్ బాడీ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కరణం విశ్వనాథం, కుంచే చిన్న మాట్లాడుతూ ఇటీవల ఆటోలు విపరీతంగా పెరగడంవల్ల రాష్ట్ర ప్రభుత్వం వీరి రిక్షాలకు మోటర్లు బిగించి కొత్త మోటారు రిక్షాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలన్నారు. వీరి నివాశ ప్రాంతాల్లో డ్రెయినేజీ రోడ్లు విద్యుత్ సౌకర్యం కలించాలన్నారు. వీరు నివాసం ఉంటున్న గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటికి మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం నిధులు కేటాయిం చాలన్నారు. రిక్షా కార్మికులకు ప్రత్యేకమైన వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ఆ బోర్డు ద్వారా మెరుగైన సేవలు వీరికి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన పట్టణ నూతన కమిటీ అధ్యక్ష కార్య దర్శులుగా పెదపాటి సత్య నారాయణ, ఏడిది నూకరాజు, వైస్ ప్రెసిడెంట్ శ్రీమంతుల సత్తిబాబు, సంయుక్త కార్యదర్శి దూలపల్లి చిట్టిబాబు, కోశాధి కారిగా చాట్ల సోమరాజు, గౌరవ అధ్యక్షులుగా వి.వెంకట్రావు, కమిటీ సభ్యులుగా మోర్త సూర్యారావు, పల్లి సత్తిబాబు వేమగిరి ఆనందరావు, కొల్లు రాజుబాబు, కోళ్ల వెంకటరమణ, దూలపల్లి ఏసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఏడిది సత్తిబాబు, పెదపాటి రాజబాబు, దేవరపు చంటి, వేమగిరి అప్పారావు, గొడిచర్ల పేద బాలరాజు, కొండయ్య పాల్గొన్నారు.



రిక్షా కార్మిక సంఘం నూతన కార్యవర్గం



సిడిపిఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీల యూనియన్ నాయకులు

తొలగించిన అంగన్‌వాడీ వర్కర్‌ని విధుల్లోకి తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మరలావ సెక్టర్ లో విధుల నుండి తొలగించిన అంగన్‌వాడీ వర్కర్ ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌డిఒ సీతారామారావు, సిడిపిఒ జి.ఉషలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి సావిత్రి, దాడి బేబీలు మాట్లాడుతూ సెప్టెంబర్ 23వ తేదీన వర్కర్‌ను రాజకీయ వేధింపుల కారణంగా విధుల నుండి తొలగించారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించినా స్పందన లేదన్నారు. తొలగించిన అంగన్‌వాడీ వర్కర్ ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని దశల వారి ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 12న ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లు మూసివేసి ఆందోళన చేస్తామన్నారు.13వ తేదీ నుండి 17వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎంపిపి, జడ్పీటీసీ, ఎంఇఒ, సంఘాల నాయకులు

ఉపాధ్యాయ కుటుంబానికి యుటిఎఫ్ సాయం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం నెంబర్ 2 పాఠశాలలో పనిచేస్తున్న కె.వి పార్వతీశం అనే ఉపాధ్యాయులు ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబానికి యుటిఎఫ్ సంక్షేమ నిధి నుంచి సహాయం అందజేశారు. బుధ వారం సాయంత్రం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన యుటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, జడ్‌పిటిసి ఎలిశెట్టి అమృత నరేష్‌లు ఉపాధ్యాయుడు కేవీ పార్వతీశం సతీమణి ఉషాదేవికి మూడు లక్షల నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ వై.శివ రామ కష్ణయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్మ మాట్లాడుతూ పార్వతీశం ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు అన్నారామ్, అధ్యక్షులు సిహెచ్ శ్రీరామ్, మండలశాఖ గౌరవ అధ్యక్షులు ఎస్వీ రామారెడ్డి, నాయ కులు కెఎంఎంఆర్ ప్రసాద్, సీతారామ్, బలరామ్, పేర్రాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మట్టి దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవి శంకర్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పెద్దాపురం మండలం ఆనూరులో మట్టి దినోత్సవం సదర్భంగా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. మట్టి సారం తేమ శాతం అంశాలపై, మొక్కలు నాటి ప్రకతిని పరిరక్షించాలని కోరుతూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయితీ సెక్రటరీ ఎన్ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ కె.శృతి,రేణుక, జ్ఞానేశ్వరి.. విద్యార్థులు పాల్గొన్నారు

కార్టూ'నిజం'



మిగతా రుణాలను చెల్లించకుండా విదేశాలకు పారిపోయారు..!!

బిసిలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం బీసీలను ఆర్థికంగా, సామాజికంగా అన్యాయం చేస్తుందని, రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా జనాభాగా ఉన్న వెనుకబడిన తరగతుల (బీసీ)కు గత మూడున్నర సంవత్సరాల నుండి తీవ్రమైన అన్యాయం జరుగుతోందని, చేతివృత్తులు, కుల వృత్తులు చేసుకుంటూ జీవనం పొందే బీసీల అభివద్ధి, పురోభివద్ధి లేకుండా పోయిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జగ్గంపేట మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ తీవ్రంగా విమర్శిం చారు. ఇదేమి కర్మ మన బీసీలకు కార్యక్రమంలో భాగంగా సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. నెహ్రూ మాట్లాడుతూ బీసీలు హక్కుగా పొందాల్సిన సబ్ ప్లాన్ నిధుల నుండి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల వరకు ప్రతి అంశంలో నిరాదరణకు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. 10 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు శాసనసభలో తీర్మానం చేయాలని, అందుకు ఎంపీలు పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని, జనాభా దామాషా ప్రకారం 56 బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి, ఖర్చుపెట్టాలని బేషరతుగా విదేశీ విద్య పథకాన్ని కొనసాగించాలన్నారు. జీవో నెం. 217 ను రద్దు చేయాలని, బీసీలకు చిన్న , మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు అందించే రాయితీలను పునరుద్ధరించాలన్నారు. బీసీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాకినాడ మాజీ ఎంఎల్‌ఎ మనవడి కొండబాబు, యనమల కృష్ణుడు, పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ వర్మ పాల్గొన్నారు. **కరప** మండ లంలో జెడ్ బావారంలో బుధవారం కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్య నారాయణమూర్తి ఇంటింటికి మీ అన్నతలక్ష్మి 8వ రోజున ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గుల్లిపల్లి శ్రీనివాస రావు, నాయకులు మేడిశెట్టి దుర్గారావు, పంపన కన్నారావు, కోటగిరి మహేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** అధికార పార్టీ నిర్వహించిన జయహో బిసి కార్యక్రమం వల్ల బీ.సీ.లకు ఒరిగేది ఏమీ లేదని ఉభయగోదావరి జిల్లా, తాళ్లరేవు మండల తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు తీవ్రంగా విమ ర్శించారు. తాళ్ళరే వు అంబేద్కర్ భవన వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ నాయకుడు కట్ట త్రిమూర్తులు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ సమయంలో బీసీలకు ఆదరణ పథకం, చంద్రన్న బీమా వంటి పథకాలు, ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసేవారని ఇప్పుడు ఒక్క పైసా కూడా కార్పొరేషన్ నుండి లోన్లు రావడం లేదని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి జయహో బీసీ అంటూ కొత్త పల్లవి ఎత్తుకున్నారన్నారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, పిల్లి సత్తిబాబు, పాలెపు నాగేశ్వరరావు, కుడిపూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. **కాకినాడ కార్పొరేషన్** ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బుధవారం కాకినాడ సిటీ మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి 33వ డివిజన్‌లో పర్యటించారు. ఇంటి ఇంటికి వెళ్లి వైసిపి పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్ర మంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, 33వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుజ్జు దుర్గ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు

ప్రత్యేక హోదా ముగిసిన అంశం కాదు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రత్యేక హోదా ముగిసిన అంశం కాదు రగులుతున్న అంశం ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ నరాల శివ అన్నారు. బుధవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా సాధన కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విభజించి ఆంధ్ర ప్రజలకు పుష్కలంగా ఉన్న హైదరాబాద్ నగరం తెలంగాణకు విడదీసి, అప్పటి భారత ప్రధాని మన్మోహన్ సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా 5 యేళ్లు కాకుండా పదేళ్ల పాటు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం బిజెపి కూడా అదే హామీతో గద్దెనెక్కి ప్రజలు నిలదీయడంతో ప్రత్యేక హోదా ముగిసిన అంశంగా పేర్కొంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక హోదా విభజన చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ఆనాటి నుండి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రత్యేక హోదా సాధించే వరకు పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వరద రావు సాంచి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫణిరాజు, గోదావరి జిల్లాల కో కన్వీనర్ ఎస్.ఎ.ఎస్. రామారావు, కాకినాడ సిటీ అధ్యక్షులు వంగపండు కృష్ణ, సీపీఐ జాతీయ కౌన్సిల్ తాటిపాక మధు, ఉత్తరాంధ్ర జోన్ కో ఆర్డినేటర్ మేడిశెట్టి రామ్మోహన్, రాజమహేంద్రవరం నగర ఆప్ కన్వీనర్ ఆత్రేయ రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల శత జయంతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎన్టీఆర్, ఏఎన్నార్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షులు ఉంగరాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తాళ్లరేవు ప్రజా సంఘాల భవనంలో అమర గాయకుడు ఘంటసాల శతజయంతి సందర్భంగా ఘంటసాల, మహానటి సావిత్రి జయంతి వేడుకలు నిర్వహించారు. సభలో పలువురు ఘంటసాల వెంకటేశ్వర రావు, సావిత్రి కళా రంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక సిటీ కన్వీనర్ టేకీ ముడి ఈశ్వరరావు పులిపు తాతయ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత వెంకటేశ్వరరావు, ఎలిపే నాగేశ్వరరావు, హరిచంద్ర నాటక కళాకారులు సత్యనారాయణ (యానం) గుత్తుల మల్లేశ్వరరావు, వాకపల్లి చిరంజీవి, సుందరపల్లి సత్యనారాయణ, విశ్రాంత గెజిటెడ్ హెచ్‌ఎం. నాగేశ్వరరావు, తణుకు రాజు, జవహర్, రాజు పాల్గొన్నారు.

పైడాలో ముగిసిన ఆక్వా ప్రదర్శన

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు మండలంలోని పైడా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫిషరీస్ విభాగానికి చెందిన విద్యార్థులు ఆక్వాడిగ్రీ 2.కె.22 పేరుతో రెండురోజులు నిర్వహించిన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. పైడా డిగ్రీ, పాలిటెక్నిక్ ఫిషరీస్ విద్యార్థులు ఆక్వా రైతులకు పలు విషయాలు తెలియచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని పలు ప్రజెంటేషన్లు చేశారు. దీనిలో భాగంగా పోస్టర్ ప్రజంటేషన్, క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో పోటీలలో విజేతలుగా నిలిచారు. భీమవరం డిఎన్ఆర్, కాకినాడ, కాకినాడ ఐడియల్ కళాశాల,పి.ఆర్.జి. కళాశాలలకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాలలో మొదటి,ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో నన్నయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమణీశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు ఏర్పాటు చేసిన వంటకాల ప్రదర్శనను తిలకించి, వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, సెక్రటరీ శ్రీరామ్, జాయింట్ సెక్రెటరీ నిత్య శ్రీరామ్, డీన్ డాక్టర్ వీరభద్ర రావు, డీజీ రవీంద్రారెడ్డి, ఆక్వా డిగ్రీ 2 కే 22 కన్వీనర్, ఫిషరీస్ హెచ్ ఓ డి. సతీష్ అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



కక్షిదారులకు గమనిక

సబ్ రిజిస్ట్రారు కార్యాలయము సామర్లకోట ప్రస్తుత కార్యాలయము నుండి మాజేటి నగర్, డో.నెం: 15-9-30/1నకు మార్చబడుచున్నది. కావున మెన్యువల్ పిరియడ్ కొరకు ఇ.సి.లు, నకళ్ళు, సెర్చ్‌లు మరియు మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్లు ది. 16-12-2022 వరకు అందుబాటులో ఉండవు. కనుక సహకరించమనవి. డాక్యుమెంట్లు రిజిస్ట్రేషను, కంప్యూటర్ పిరియడ్ ఇ.సి.లు, నకళ్ళు మరియు మార్కెట్ వాల్యూ సంబంధిత సర్టిఫికెట్లు ది.12-12-2022 నుండి జారీ చేయబడునని తెలియజేయడమైనది.

ఇట్లు.. సబ్-రిజిస్ట్రారు, సామర్లకోట.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్వహించే అద్దె భవనం, బయట ఏర్పాటు చేసి ఫ్లెక్సీ

12 నుంచి కొత్త కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మాజేటి నగర్ లేఅవుట్ కాలనీలో మార్పుచేసిన అద్దె భవనంలో ఈ నెల 12వ తేదీ నుండి రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయని కక్షిదారులు గమనించాలని సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ లక్ష్మి చెప్పారు. బుధవారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ ఎస్‌బిఐ ద్వారా భవనాన్ని సీజ్ చేస్తామని నోటీసులు ఇవ్వడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు పరిశీలిన చేసిన అనం తరం సామర్లకోట ఎడిబి రోడ్డులో మాజేటి నగర్ అద్దె భవనం తీసుకున్నట్లు చెప్పారు. అద్దె నెలకు సుమారు రూ.16వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కార్యాలయం మార్పుపై కక్షిదారులకు అవగాహన కల్పిస్తు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం రాజా చిన్నారావు ఫంక్షన్ హాలు భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. రెండు రోజులుగా కార్యాలయం తరలింపు పనులు ప్రారంభించారు. శుక్రవారం నుండి పూర్తిగా కార్యకలాపాలు నిలుపుదల చేసి సోమవారం నుండి రిజిస్ట్రేషన్‌లు మార్పుచేసిన భవనంలో నిర్వహించనున్నారు.



స్వాధీనం చేసుకున్న బియ్యం తో అధికారులు

ఇంట్లో రూ.1.24 లక్షల బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామంలో బుధవారం రాత్రి కర్రి సుబ్బారావుకు ఇంటిలో 63 బస్తాలలో అక్రమంగా నిల్వ వున్న 31.50 క్వింటాళ్ల బియ్యం, ఎలక్ట్రానిక్ కాటాను విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, సివిల్ సప్లైస్ అధికారులు, రెవెన్యూ అధికారులు కలిసి దాడిచేసి సీజ్ చేశారు. ఇంటి యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. సీజ్ చేయబడిన బియ్యం విలువ రూ.1,24,700 ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తహశీల్దార్, సీఐ, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు .

వికలాంగులకు దాతల వితరణ

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలోని జి.మామిడాడలోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలలో విజేతలకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటరెడ్డి పతకాలు, బహుమతులు అందజేశారు. కర్రి తాతారెడ్డి రూ.3800ల విలువైన స్పైరల్ బైండింగ్ మిషన్‌ను, తిబిరిశెట్టి వీరభద్ర రావు, హైదరాబాదు వాస్తవ్యులు బొప్పన ఆదిలక్ష్మిలు రూ.8500ల విలువైన బీరువాను, ఐడిఎస్ఎస్ టీచర్, ఫిజియోథెరపిస్ట్ అరుణ సౌజన్య రూ.3500ల విలువైన బోర్డులను బహూకరించారు. పెదపూడి మండలం ఎంఆర్‌సి కంప్యూటర్ ఆపరేటర్ ప్రకాష్ విద్యార్థులకు స్నాక్స్, వాటర్ బాటిల్స్, డ్రింక్ బాటిల్స్, ఏర్పాటు చేశారు. ఎస్ఐ పి.వాసు 80మంది విద్యార్థిని విద్యార్థులకు భోజనాలను ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ గొల్లలమామిడాడ శ్రీ సూర్య సభ్యులు రాజారెడ్డి లయన్స్ క్లబ్ అధ్యక్షులు ద్వారంపూడి వెంకటరెడ్డి ఒకేసారి ఇద్దరు విద్యార్థులకు శిక్షణన్నిచే స్పీచ్ ట్రైనర్ను బహుకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను, దాతలను, అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.తులసి శ్రీనివాస్, సర్పంచ్ మున్ని మోహన్ రెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు, ఏఎల్ఎస్‌సి హరికష్ణ, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

'పట్టాభి'లో ప్రమాదాలపై ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వాలుతిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రో ఫుడ్స్ పరిశ్రమలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పరిశ్రమ గేటు ముందు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు డి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన కంపెనీలో రైస్‌బ్లాక్‌లో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడి చేతి వేళ్లు కట్ అయ్యాయన్నారు. ఈ కార్మికుడికి పీఎఫ్, ఇఎస్ఐ అమలు కావటం లేదన్నారు. వారం రోజులు సెలవు ఇచ్చి తిరిగి పనిలోకి రావాలని యాజమాన్యం తెలిపిందన్నారు. ఈ కార్మికుడికి ఇఎస్ఐ ఉండి ఉంటే 3 నెలలు సెలవుతోపాటు ఇఎస్ఐ నుండి వేతనం కూడా వచ్చేదన్నారు. ధర్నాలో డి.కృష్ణ, బేదంపూడి పెదబాబు, దేవాబత్తుల రమేష్, పెంకే శ్రీను, కందా శివ, కొమ్ము వరప్రసాద్, కుందేటి జాన్, యోహాన్‌రాజు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

: మండలానికి చెందిన పలువురు యువకులు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వరుపుల రాజా ఆధ్వర్యంలో బుధవారం టిడిపిలో చేరారు. ప్రతిపాడు మండలం పెద్ద శంకర్లపూడి పార్టీ కార్యాలయంలో రాజా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో డొక్కా జోగారావు, గార చిన్ని, బెల్లాన్ని శ్రీను, పన్నపు రాజు, పొట్టూరి సూర్య, వసంత ప్రసాద్, ఎరకుల మల్లేష్, బీర సద్గుణ రావు, కొప్పిశెట్టి రాజశేఖర్, అనసూరి నాగరాజు, వాకాడ కనకరాజు ఉన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు

ప్రజాశక్తి - కాకినాడ

మాజీ సైనికులు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవానుల కుటుంబాల సంక్షేమం లక్ష్యంగా చేపట్టే కార్యక్రమాలకు ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరివిగా విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా సైనిక సంక్షేమ బోర్డు చైర్పర్సన్ కృతికా శుక్లా ప్రజలకు, వివిధ సంస్థలకు పిలుపునిచ్చారు. బుధవారం భారత సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి-2022ని ప్రారంభించి, తొలి విరాళం అందించారు. ఆన్ లైన్‌లో విరాళాలు అందించేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాజీ సైనికులు, అమరవీరుల కుటుంబాల పరిరక్షణ అందరి బాధ్యత అన్న విషయాన్ని గుర్తుంచుకొని, పతాక దినోత్సవ నిధికి విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. దాతలు నేరుగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సంప్రదించిగానీ లేదా చెక్, డిడి, నగదు, ఆన్‌లైన్ ట్రాన్స్ఫర్ చేయొచ్చని తెలిపారు.

సైనిక సంక్షేమ నిధి అకౌంట్ వివరాలు:
జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లా పరిషత్ బ్రాంచ్, అకౌంట్ నెంబర్ - 6 2 0 6 4 0 6 0 6 2 3, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్0020974, ఎంఐసిఆర్ కోడ్ -533002028. ఈ విరాళాలకు ఆదాయపన్ను నుంచి సెక్షన్-80జి అనుగుణంగా మినహాయింపు ఉంటుం దని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా మాజీ సైనికులు సి.ఆర్.సి. ప్రసాద్, ఎం.పి.రామారావు, సీహెచ్ పవన్ కుమార్ (పవన్ కంప్యూటర్స్, కాకినాడ) విరాళాలకు సంబంధించిన చెక్కులను కలెక్టర్ కృతికా శుక్లాకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డాక్టర్ పి.సత్య ప్రసాద్, జిల్లాలోని పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.



క్యూ ఆర్ కోడ్ ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బుద్ధవిహార్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ఎస్.అచ్చుతాపురంలో గల అంబేద్కర్ బుద్ధ విహార్‌లో సభ్యులు అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ కోరుకొండ బాబ్జీ ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. శిబిరంలో బుద్ధ విహార్ పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు, ఎస్. అచ్చుతాపురం ప్రజలు అధిక సంఖ్యలో హాజరై రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. వీరందరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో లైఫ్ లైన్ హాస్పిటల్ ఎం.డి. డాక్టర్ భానుమతి, ప్రముఖ న్యూరో సర్జన్ కె. బాబ్జి, చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ఎం.పవన్ ప్రసాద్, ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ కె.ఆర్.ఎస్. జవహర్, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఎం.రాజేష్, డాక్టర్ పి. నరసింహామూర్తి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ అధ్యక్షులు ఎ.రామేశ్వరరావు, కార్యదర్శి పి. యస్. ఆర్. ప్రసాద్, కోశాధికారి పి.వి.సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహనిర్మాణాలను మరింత వేగ వంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో సిద్ధం కావాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ కోరారు. గృహనిర్మాణ ప్రగతిపై బుధవారం అదనపు కమిషనర్ సిహెచ్ నాగనరసింహ రావుతో కలిసి కార్పొరేషన్, హౌసింగ్, విద్యుత్,గ్రామీణ నీటి సరఫరాశాఖల తోపాటు ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ బిల్లుల చెల్లింపుపై గహనిర్మాణశాఖకు ఆయన సూచనలు ఇచ్చారు. ఇళ్ళు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రతీ ఇంటికి విద్యుత్, మంచినీటి కనెక్షన్‌తోపాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆయా శాఖల అధికారులు ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎడిసి సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ కొమరగిరితోపాటు పండూరు, ఏపీ త్రయం లేఅవుట్లలో కూడా గృహ నిర్మాణాలు ప్రారంభించేలా లబ్ధిదారులతో ఒప్పంద పత్రాలు తీసుకోవడంతోపాటు సంబంధిత కాంట్రాక్టర్లతో కూడా చర్చించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా ప్రతీ ఉద్యోగి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, హౌసింగ్ డిఈ గుప్త, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, జెఎన్ఆర్ కనస్ట్రక్షన్స్ ప్రతినిధి నారాయణ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

సంవత్సర కాలం పైగా ఉన్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల బకాయిలు తక్షణం విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం బుధవారం ధర్నా చౌక్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ ధర్నా శిబిరానికి కాకినాడ జిల్లా ఎస్టీయూ అధ్యక్షులు కె.కాశీ విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి మూర్తా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభిస్తూ ఎస్టియు సీనియర్ నాయకులు పి. సుబ్బరాజు మాట్లాడుతూ తక్షణమే ఉద్యోగ ఉపాధ్యాయలకు సంబంధించిన మొండి బకాయి మొత్తం విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం విద్య రంగ వ్యతిరేక చర్యలను ఉపసంహరించుకోకపోతే ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతను చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మూర్త శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శెట్టి సత్యనారాయణ, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు ఎన్ఎస్ఎస్ వెంకటేశ్వరరావు, పి వి సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షునిగా హరి

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడి తిరుమల జూనియర్ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ మండల మహాసభ ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పి.వరహాలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు జి.రాము హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా ఎం హరి కార్యదర్శిగా ఎన్ కే సాయి ఉపాధ్యక్షులుగా లో వరాజు. శివ. వీరబాబులు ఎన్నికైనట్లు ప్రకటిం చారు. ఈనెల 8వ తేదీన కాకినాడలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని నూతన కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఐదుగురు క్రాఫ్ట్ టీచర్లకు

మదర్ థెరిస్సా ఫైన్ ఆర్ట్స్ అవార్డులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న క్రాఫ్ట్ టీచర్లు ఐదుగురికి మదర్ దెరిస్సా ఫైన్ ఆర్ట్స్ అవార్డులు లభించాయి. ఈ మేరకు బుధవారం క్రాఫ్ట్ టీచర్లు ఆర్.స్వర్ణలత, ఆర్.విజయకుమార్‌లు మాట్లాడుతూ మదర్ థెరిస్సా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా 2022 సంవత్సరానికి సంబంధించి సామర్లకోట మండల పరిధిలో ఐదుగురు క్రాఫ్ట్ ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు అందించినట్లు చెప్పారు. సామర్లకోట జడ్‌పి బాలిక ఉన్నత పాఠశాల టీచర్ ఆర్.స్వర్ణలత, గవర్నమెంట్ హైస్కూల్ టీచర్ ఆర్ విజయకుమారి, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ టీచర్ సరస్వతి, మండలంలోని మాధవ పట్నం ఉన్నత పాఠశాల టీచర్ కామేష్, వేట్లపాలెం ఉన్నత పాఠశాల టీచర్ భానులకు ఈ అవార్డులు లభించినట్టు చెప్పారు. వీరు రూపొందించిన క్రాఫ్టాం శాలు రాష్ట్రస్థాయిలో పలువురిని ఆకట్టుకోవడంతో ఈ అవార్డులు లభించినట్టు క్రాఫ్ ఉపాధ్యాయులు తెలిపారు కాగా వీరిని దుశ్శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో మదర్ థెరిస్సా ఫైనార్ట్స్ అకాడమీ నిర్వాహకులు సత్కరించారు.

నేరాలు ఘోరాలు

మూలపేటలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

మూలపేట బొమ్మల ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరరావు బుధవారం తెలిపారు. కొత్త మూలపేట బొమ్మలు పరిశ్రమ ఉన్న బీచ్ రోడ్డు పక్కన ఉన్న తుప్పల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు తెలపడంతో ఆ ప్రదేశానికి చేరుకుని పరి శీలించగా గుర్తుతెలియని మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. అయితే అతని శరీర భాగం చెయ్యి విడిగా ఉన్నట్లు తెలిపారు. మతుడు లుంగీ తో ఉండగా. వేరుగా ఉన్న చెయ్యికి ఉంగరం ఉన్నట్లు తెలిపారు. మూడు రోజుల క్రితమే మతదేహం ఇక్కడ ఉండవచ్చని తెలిపారు. ప్రమాదవశాత్తూ మృతి చెందాడా లేక ఇతర సంఘటన ఏమైనా చోటుచేసుకుందా అనే కోణంలో కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అరుణ్‌కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి



అరుణ్‌కుమార్

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈ.సి.ఇ. విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న జి.ఎ.అరుణ్. కుమార్, పాండిచ్చేరి యూని వర్సిటీ నుంచి, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (డాక్టరేట్) పొందినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేశారు. డాక్టర్ జ్ఞానయో ఫ్లోరెన్స్ సుధ నేతత్వంలో అరుణ్‌కుమార్ సమర్పించిన "లో పవర్ వి.ఎల్.ఎస్.ఐ. ఆర్కిటెక్చర్ ఆఫ్ ఫ్లోటింగ్ పాయింట్ అరథమెటిక్ యూనిట్ యూజింగ్ క్యు సి.ఏ' శీర్షికపై థీసిస్ సమర్పించినందుకు గాను డాక్టరేట్ పొందరాని తెలిపారు. అరుణ కుమార్‌కు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్, పిన్సిపాల్. ఎం.శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డోలా సంజయ్ సుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపారు.



వీల్‌చైర్ అందజేస్తున్న దృశ్యం

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి -కాట్రేనికోన

మండల విద్యాశాఖ అధికారి బి. రమణశ్రీ ఆధ్వర్యంలో ఎంపిపిఎస్ చెయ్యేరు హెచ్‌ఎం బాబ్జి అధ్యక్షతన భవిత సెంటర్‌లో బుధవారం ఘనంగా దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ చెల్లి సురేశ్ పాల్గొని మాట్లాడుతూ వికలాంగులకు చిన్నచూపు చూడకూడదన్నారు. ఎంపిటిసి సభ్యురాలు గుత్తుల సూర్య మహాలక్ష్మి మాట్లాడుతూ పిల్లల్లో మనం అందరం ఆత్మస్థైర్యం నింపాలన్నారు. జెడ్‌పిహెచ్ఎస్ చెయ్యేరు హెచ్‌ఎం మాట్లాడారు. అనంతరం వికలాంగుల విద్యార్థులకు ఉపకరణాలు అందజేశారు. పిల్లలతో కేక్ కటింగ్ చేయించారు. ఎంఆర్‌సి సిబ్బంది విద్యార్థులకు స్వీట్లు అందజేశారు. జెడ్ పిహెచ్ఎస్ చెయ్యేరు స్కూల్ అసిస్టెంట్స్ బంగారయ్య శర్మ పిల్లలకు భోజనాలు, జివి. కుమార్ బహుమతులు అందజేశారు. సిహెచ్ శివ 15 కుర్చీలు, సిహెచ్ వెంకటేశ్వరరావు స్నాక్స్ అందచేశారు. కార్యక్రమంలో జెడ్‌పిహెచ్ఎస్ చెయ్యేరు ఎస్ఎంసి ఛైర్మన్ మట్టపర్తి మంగలక్ష్మి శ్రీనివాసు, స్థానిక అంగన్‌వాడీ టీచర్ దుర్గాదేవి, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం.స్వర్ణలత, ఎం.తులసి పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి

ప్రజాశక్తి -ఆలమూరు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

. లింగ వివక్షతను రూపుమాపాలని, సమ సమాజ స్థాపనకు అందరూ పాటుపడాలని ఎంపిడిఒ కె.జాన్‌లింకన్ తదితరులు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద లింగ వివక్షకు వ్యతిరేకంగా ఎంపిడిఒ అధ్యక్షతన వైఎస్ఆర్ క్రాంతి పదం ఆధ్వర్యంలో ఇంచార్జ్ ఎపిఎం ధనరాజు బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, సిసిలు భీమరాజు, సుబ్బారావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వెంకటేష్ దంపతులను సత్కరిస్తున్న డాక్టర్ నాగార్జున, సిబ్బంది

పిహెచ్‌సి ఉద్యోగికి సత్కారం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పిహెచ్‌సిలో సుమారు 19 ఏళ్ల పాటు హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసి డిప్యూటేషన్‌పై కొత్తపేట మండలం వానపల్లి పిహెచ్‌సికి పి.వెంకటేష్ బదిలీ అయ్యారు. బుధవారం పిహెచ్‌సిలో వెంకటేష్ దంపతులను ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ వెంకటేష్ సేవలు అభి నంద నీమ యమని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎల్.నాగార్జున, సిహెచ్ఒ ఎం.విజయ లక్ష్మి సూపర్ వైజర్, ఐ. చిట్టిబాబు, పిహెచ్‌సి సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు చిర్ల పాదయాత్ర

ప్రజాశక్తి - ఆలమూరు

కొత్తపేట ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి తలపెట్టిన పాదయాత్ర బుధవారం 12వ రోజుకు చేరుకుంది. సుమారు 400 కి.మీ మేర తిరుమల నుంచి శ్రీశైలం వరకు ఈ పాదయాత్రకు చేస్తున్నారు. చెముడులంక నుంచి పలువురు వైసిపి సీనియర్ నేతలు పాదయాత్ర చేస్తున్న ఎంఎల్‌ఎ జగ్గిరెడ్డిని కలిసి సంఘీభావం తెలిపి సత్కరించారు.కార్యక్రమంలో ఆలమూరు మండల వైసిపి కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, మండల కాపు సంఘ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, నాయకులు పెంటపాటి వెంకన్న, నల్లి రాజు, పడమటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

9న కొత్తూరులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఆలమూరు

మురళీకృష్ణ సంస్థల సౌజన్యంతో ఈ నెల 9న కొత్తూరు సెంటర్ వద్ద గల ఎస్‌జెఆర్ ఫంక్షన్ హాల్ నందు అమలాపురం కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఆ సంస్థ అధినేత, దాత వంటిపల్లి పాపారావు విలేకరులు వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 9న తన కుమారుడు వంటిపల్లి మురళీకృష్ణ పుట్టినరోజుని, ఈ సందర్భంగా పేదల కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరంలో వైద్య సేవలు అందిస్తారన్నారు. పరిసర ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ సభ్యులు తదితరులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

నవ దుర్గా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సభ్యుడు మామిడికుదురు కు చెందిన కంచి శ్రీనివాసరావు ఆకస్మిక మృతి చెందారు. యూనియన్ తరపున ఆయన కుటుంబ సభ్యులకు బుధవారం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు మెడబక రామారావు, ప్రధాన కార్యదర్శి బి.జనార్ధనరావు, మామిడిశెట్టి సత్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు, పి.వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.



తాపేశ్వరం రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

రోడ్డు పనులతో ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి-మండపేట

మండపేట-ద్వారపూడి రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో తాపేశ్వరం వద్ద తరచూ ట్రాఫిక్ కు తరచు అంతరాయం కలుగుతుండడంతో విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగస్తులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోలతో ఈ రోడ్డు కిక్కిరిసిపోతోంది. అయితే ఆర్‌టిసి బస్సులు, భారీ వాహనాల రాకపోకలను ఈ రోడ్డులో నిలిపివేసినప్పటికీ కొన్ని భారీ వాహనాలు ఈ రోడ్డులో వస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంతరాయం లేకుండా చర్యలు

ఈ విషయంపై రోడ్డు భవనాల శాఖ జెఇ సూర్యనారాయణరావును వివరణ కోరగా ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చర్యలు చేపడతామన్నారు.